సాక్షి గుంటూరు

గురువారం । 14 । ఆగస్టు । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



కాలువలోకి జారిన కళాశాల బస్సు

కొల్లూరు : ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి బుధవారం పంట కాలువలోకి జారింది. చివరకు పొక్లెయిన్ సాయంతో బస్సును బయటకు తీశారు.

కలెక్టర్ కార్యాలయం సందర్శన



బాపట్ల : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్. విజయభారతి బుధవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. 'హర్ ఘర్ తిరంగా' ఫొటో ఫ్రేమ్ వద్ద దేశభక్తిని చాటారు.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల దృష్ట్యా గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి.రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు విధిగా సెలవు దినంగా పాటించాలని ఆదేశించారు.

వరద ఉధృతిని పరిశీలించిన సబ్ కలెక్టర్



తాడేపల్లిరూరల్ : ప్రకాశం బ్యారేజ్ వద్ద ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరడంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి కృష్ణానది పుష్కర ఘాట్ల వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని ఆమె ఆదేశించారు. వరద నీటిలోకి ఎవరూ దిగకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

మూడు రోజుల పాటు మార్కెట్ షాపుల బహిరంగ వేలం

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ షాపుల బహిరంగ వేలం ఈ నెల 18, 19, 20 తేదీలలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో రాష్ట్ర గవర్నర్ పర్యటన, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల వల్ల వాయిదా పడిన షాపుల వేలాన్ని నిబంధనల మేరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలు తరలింపు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): కృష్ణా నది పరీవాహక గ్రామాల్లోని ప్రజలను, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనితకు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి వంగలపూడి అనిత భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంత్రి వంగలపూడి అనిత తో మాట్లాడుతూ గుంటూరు చానల్ ఓవర్ ఫ్లో కారణంగా నంబూరులోని లోతట్టు కాలనీల్లో వరద నీరు చేరినందున 150 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. తాడికొండ మండలం గరికపాడు, బేతాజీపురంలలో కొండవీటి వాగు పొంగి ప్రవహిస్తున్నందున 75 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, మందులు అందించడం జరిగిందన్నారు. జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర మండలాల్లో వర్షపాతం అధికంగా నమోదైందన్నారు. కొల్లిపర మండలంలో పంట నష్టం అధికంగా ఉందన్నారు. తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో బోటు తీసుకు రావడానికి వెళ్ళిన ముగ్గురు మత్స్యకారులలో ఇద్దరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ద్వారా వారిని రక్షించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గుంటూరు ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి. హోస్‌మణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్‌ఏసీ) ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డాక్టర్ కె.సుచిత్రను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేసి, అక్కడ రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా డాక్టర్ జి.శోభరాణి గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియలిస్టుగా పనిచేస్తున్నారు. గతంలో డాక్టర్ శోభరాణి గుంటూరు ఆర్డీగా పనిచేశారు.



గుంటూరులో నీట మునిగిన సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్



పెదకాకాని మండలంలో నీట మునిగిన పంట పొలాలు



తటాకాన్ని తలపిస్తున్న పేరేచర్ల బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ కాలనీ

దంచికొట్టిన వాన

భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలం

- కొద్ది గంటల్లోనే 14 సెంటీమీటర్ల వర్షపాతం
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- భారీగా నీట మునిగిన పంటలు
- జిల్లాలో 72,612 ఎకరాల్లో దెబ్బతిన్న వైనం
- పుట్టెడు కష్టంలో అన్నదాతలు
- జలమయంగా కాజా టోల్‌గేట్
- గుంటూరు నగర రోడ్లపై భారీగా వర్షం నీరు.. ట్రాఫిక్ అంతరాయం
- మరో రెండురోజులు భారీ వర్షసూచన
- నంబూరులో వరదనీటిలో పడి బాలుడు మృతి



వర్షపు నీటిలో గుంటూరు ఆర్టీసీ బస్‌స్టేషన్



పెదకాకాని మండలం గోళ్లమూడి గ్రామసమీపంలో గుంటూరు చానల్ కాల్వకు పడిన గండిని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నీట మునిగిన వేలాది ఎకరాలు (డ్రోన్ చిత్రం)



తెనాలిలో మోకాలి లోతులో నీరు నిలిచిన వరిచేలో నిలబడి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కంట్రోల్ రూమ్ నంబరు 0863 2234014

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వరుణుడు రైతుల ఆశలను నిలువునా ముంచేశాడు. కొద్దిగంటల సమయంలోనే విరుచుకుపడ్డాడు. మంగళవారం రాత్రి పది గంటల నుంచి ప్రారంభమైన వాన తెల్లవారుజామున తెరిపిచ్చి, అనంతరం బుధవారం సాయంత్రం మొదలుకొని గురువారం తెల్లవారు జాము వరకు కురుస్తూనే ఉంది. బుధవారం ఉదయం నాటికే జిల్లాలో సగటున 14.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా చేబ్రోలు మండలంలో అత్యధికంగా 23.4 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. గుంటూరు నగరం, మంగళగిరి, తెనాలి, పొన్నూరు పట్టణాలు అస్తవ్యస్తంగా మారాయి. గుంటూరు నగరంలో ట్రాఫిక్ పలుమార్లు స్తంభించింది.

పొంగిన వాగులు

కాజా టోల్‌గేటు వద్ద జాతీయ రహదారిపైకి వరదనీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. టోల్‌ప్లాజా వద్ద మూడు అడుగుల వరకు నీరు ఉండడంతో గుంటూరు నుంచి విజయవాడ వైపు ద్విచక్రవాహనాలు వెళ్లే లైన్‌తో పాటు మరో రెండు లైన్లను నిలిపివేశారు. దీంతో వాహనాలు నెమ్మదిగా పంపించే క్రమంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. టోల్‌గేటు వద్ద వున్న ఫుడ్‌ప్లాజా రెస్టారెంట్‌లోకి వర్షపు నీరు చేరింది. రాజధాని గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పెదపరిమి వద్ద కోటేళ్ల వాగు, కంతేరు వద్ద ఎర్రవాగు, అయ్యన్నవాగు, పాలవాగులు పొంగడంతో రహదారులపైకి నీరు చేరింది. నీరు పోయే మార్గం లేకపోవడంతో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. లాం వద్ద కొండవీడువాగు పొంగడంతో ఉదయం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో ఆడుకుంటూ వరదనీరు ప్రవహిస్తున్న డ్రైన్‌లో పడి నేలపాటి యోహాన్(14) అనే బాలుడు మృతి చెందాడు.

నీళ్లలో అండర్ బ్రిడ్జిలు.. ట్రాఫిక్ కష్టాలు

గుంటూరు నగరంలో పలుప్రాంతాలు నీటమునిగాయి. మూడొంతెనలు, కంకరగుట్ట అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్పొరేషన్ కార్యాలయంలోకి మురుగునీరు వచ్చి చేరింది. దీంతో మోటార్ల సాయంతో వాటిని బెయిల్ అవుట్ చేయాల్సి వచ్చింది. రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లలోకి వర్షపు నీరు చేరడంతో వ్యాపారస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు.



చేబ్రోలు మండలం శలపాడులోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నిలిచిన వర్షపు నీరు

71,612 ఎకరాల్లో వరి, పత్తి, మినుము పంటలు నీట మునక

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో కురిసిన భారీ నుంచి అతి భారీ వర్షాలకు 71,612 ఎకరాల్లో వరి, పత్తి, మినుము పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వీటిలో 11 మండలాల్లోని 88 గ్రామాల్లోని 28,437 మంది రైతులకు చెందిన వరి 62,275 ఎకరాలు, నాలుగు మండలాల్లో 16 గ్రామాలకు చెందిన 3,475 మంది రైతులకు చెందిన పత్తి 8,550 ఎకరాలు, రెండు మండలాల్లోని నాలుగు గ్రామాల్లో 315 మంది రైతులకు చెందిన మినుము 787.5 ఎకరాల్లో నీట మునిగినట్లు గుర్తించారు. వర్షాలు తగ్గి నీరు బయటకు వెళ్లిన తర్వాత ఎన్యుమరేషన్ చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



లాం వద్ద కొండవీటి వాగుపై భారీగా వరద పారుతుండటంతో నిలిచిన రాకపోకలు

జిల్లావ్యాప్తంగా జోరు వాన

పొన్నూరులో వర్షంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. డీవీసీ కాలనీ, ఏడో వార్డు, పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. పెదకాకాని మండలంలో నంబూరు, గోళ్ళమూడి గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వరద నీరు రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వెనిగండ్ల చెంచుకాలనీ గుడిసెలను వర్షపునీరు చుట్టుముట్టింది. గుంటూరు ఛానల్(కొత్తకాలువ) పంట కాలువకు గండి పడటంతో నీరు పొలాల్లోకి చేరుతోంది.

- మంగళగిరి నగరంలో భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ చెరువులను తలపించాయి. నగర పరిధిలోని ఇందిరానగర్, కొత్తపేట, రత్నాలచెరువు, లక్ష్మీ నరసింహస్వామి కాలనీ, బాపనయ్యనగర్, ఎస్టీ కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో నివాసితులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఎన్ఆర్ఐ వైద్యశాల వద్ద రహదారి కోతకు గురికావడంతో రోడ్డుపైకి రెండు అడుగుల ఎత్తు వరకు నీరు నిలిచిపోయింది. టిడ్కో గృహ సముదాయంలో భారీ వర్షానికి రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల పరిధిలో వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో కాకుమాను, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాల్లో అకాల వర్షానికి వరి, పత్తి, అపరాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రవాణా వ్యవస్థ స్తంభించింది. గ్రామాల్లో ప్రధాన రహదారులపై వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిపోయాయి. చెరువులు, కుంటలు వరద నీటితో నిండిపోయా. పలు రోడ్లకు వర్షపు నీటితో రోడ్లు కొట్టుకుపోయాయి.
- తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం మండలంలో వేమవరం, కండ్రిక, ఆరోగ్యనగర్, జగనన్న కాలనీలకు వెళ్లే రైల్వే అండర్‌పాస్‌ల వద్ద నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- తెనాలి పట్టణంలో మారీసుపేట, నందుపేట, ఐతానగర్, చినరావూరు. యడ్లలింగయ్య కాలనీ, బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, చెంచుపేట, ఇందిరానగర్ కాలనీ, ఉడా కాలనీ, పూలే కాలనీ తదితర ప్రాంతాలలోని పలు రోడ్లు పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయాయి. తెనాలిలో వరి పంట పెద్ద మొత్తంలో నీట మునిగింది. నియోజకవర్గంలో అన్నిచోట్లా వరిపైరు 30–40 రోజుల దశలో ఉంది. ఈ తరుణంలో కురిసిన భారీ వర్షంతో దాదాపు 12 వేల ఎకరాల్లో వర్షపునీరు నిలిచింది. కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట, నందివెలుగు, కటెవరం, కంచర్లపాలెం, అంగలకుదురు, సంగం జాగర్లమూడితోపాటు కొల్లిపర మండలంలో పలుగ్రామాల్లో పంటలు నీట మునిగాయి.



నీట మునిగిన గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం



తాడికొండ- నీరుకొండ మధ్య నీట మునిగిన పంట పొలాలు



ఉండవల్లి అరటి తోటలో నిలిచిన వర్షపునీరు



మంగళగిరి రత్నాల చెరువు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జిల్లాలో వర్షపాతం ఇలా..

- చేబ్రోలులో 234.8 మి.మీ వర్షం
- నగటున 145.3 మి.మీ వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 234.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా కాకుమాను మండలంలో 60.4 మి.మీ వర్షం పడింది. సగటున 145.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. దుగ్గిరాల మండలంలో 225.8 మి.మీ., తాడికొండ 225, మంగళగిరి 194.8, పెదకాకాని 186.8, తుళ్ళూరు 180.2, తెనాలి 178.4, పొన్నూరు 144.2, గుంటూరు తూర్పు 140.2, మేడికొండూరు 140.2, కొల్లిపర 138.2, గుంటూరు పశ్చిమ 132.2, ఫిరంగిపురం 111.2, తాడేపల్లి 106.4, వట్టిచెరుకూరు 89.6, ప్రత్తిపాడు 65.4, పెదనందిపాడు మండలంలో 62.4 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు 13వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 69.1 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 172.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నంబూరు చప్టాలో పడి విద్యార్థి మృతి

పెదకాకాని: ఓ విద్యార్థిని చప్టాలో ప్రవహిస్తున్న నీరు మృత్యు రూపంలో మింగేసింది. ఈ ఘటన నంబూరు గ్రామంలోని విజయభాస్కర్‌నగర్‌లో బుధవారం జరిగింది. పెదకాకాని మండలం నంబూరు విజయభాస్కర్ నగర్‌కు చెందిన నేలపాటి సురేష్‌బాబు, ఎస్తేరురాణి దంపతులకు యోహాన్, షారోన్‌లు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యోహాన్ 8వ తరగతి, చిన్న కుమారుడు షారోన్ 5వ తరగతి చదువుతున్నాడు. నంబూరు గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పిల్లలతో పాటు బయట ఆడుకుంటున్న యోహాన్ మరికొందరు కాజ రోడ్డులో ఉన్న చప్టాపైపు వెళ్ళారు. మురుగు చెరువు నీటి ఉధృతికి యోహాన్ కాలుజారి చప్టాలో పడి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు గాలించారు. అప్పటికే నీట మునిగిన యోహాన్ (14) మరణించాడు. ఆడుకునేందుకు బయటకు వెళ్లిన కొడుకు నిమిషాల వ్యవధిలోనే మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికుల హృదయాలను కలచివేసింది.



మృతిచెందిన బాలుడు యోహాన్

అంతర్జాతీయ వేదికపై మెరిసిన జెస్సీ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందనలు


జెస్సీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): జూలై 24 నుంచి 29 వరకు దక్షిణ కొరియాలో జరిగిన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం గెలుచుకున్న మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్, జెస్సీరాజ్ తన పతకాల జాబితాలో మరో మైలురాయిని చేర్చుకోవడం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని జెస్సీ రాజ్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ముందుగా జెస్సీని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ క్రీడా ప్రయాణానికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమె కోచ్ సింహాద్రిని ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే, జెస్సీ విజయయాత్రలో నిరంతర ప్రోత్సాహం, నిబద్ధత కనబరుస్తున్న ఆమె తల్లిదండ్రులను కూడా జిల్లా కలెక్టర్ అభినందించారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థులను విద్యతో పాటు, అన్ని రంగాల్లోను రాణించేలా తీర్చిదిద్దేందుకు సంక్షేమ అధికారులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ బాధ్యతగా విధులు నిర్వహించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ ఎస్. సత్యనారాయణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, ఎంజేపీఏపీబీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ప్రిన్సిపల్స్, వసతిగృహాల సంక్షేమ అధికారులు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులకు నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల సంక్షేమ అధికారులు విద్యను అందించటంతో పాటు, విద్యార్థులు క్రమశిక్షణతో జీవించేలా వ్యక్తిత్వ వికాసం పెంపొందించాలన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా క్రీడలు, ఆర్ట్స్ తదితర సృజనాత్మక రంగాల్లో ప్రోత్సహించాలన్నారు.
రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ చంద్రశేఖర రాజు మాట్లాడుతూ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల నిర్వహణను మరింతగా మెరుగుపర్చి, విద్యార్థులకు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో విద్యను అందించాలన్న ఉద్దేశంతో బీసీ సంక్షేమ అధికారులకు, వసతి గృహాల సంక్షేమ అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్పీ హేశ్వరరెడ్డి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా నిరంతరం వసతి గృహ సంక్షేమ అధికారులు పర్యవేక్షించాలన్నారు.

గుంటూరులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

- ఒక పక్క శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు
- వర్షం నేపథ్యంలో నీట మునిగిన కంకరగుంట, మూడు వంతెనల అండర్‌పాస్‌లు
- రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ జామ్


నగరంలోని నిలిచిపోయిన వాహనాలు


కంకరగుంట అండర్‌పాస్ వద్ద నిలిచిన నీరు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): భారీ వర్షాలకు గుంటూరు నగరం అతలాకుతలమైంది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఒక పక్క శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి పనులు సాగుతుండటంతో అటుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో వాహనదారులంతా కంకరగుంట ఫ్లై ఓవర్ మూడు వంతెనల మీదుగా రావాల్సి ఉంది. వాహనదాల రద్దీ అధికం కావటం, దీనికి తోడు మూడు వంతెనల కింద జలమయం కావటం, కంకరగుంట ఫ్లెఓవర్ అండర్ పాస్ సముద్రాన్ని తలపించేలా ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. దీనితో కంకరగుంట బ్రిడ్జి పూర్తిస్థాయిలో వాహనాలతో నిండిపోయింది. హిందూ కళాశాల కూడలిలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతాయం కలగటంతో ట్రాఫిక్ పోలీసుల సైతం ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పరిస్థితి సరేసరి. బస్సులు బయటకు వచ్చే క్రమంలో, ఆటోలు అక్కడే నిలిచిపోవటం, సిటి బస్సులు అక్కడే నిలబడిపోవటంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. కొత్తపేట శివాలయం వద్ద భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ వద్ద ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించింది. ఏటుకూరు రోడ్డు, పట్నంబజారు, ఏలూరు బజారు, పూలమార్కెట్ సెంటర్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. నగరంలో సుమారు రెండు గంటలపైనే ట్రాఫిక్ స్తంభించిపోయింది.

ట్రాఫిక్ పోలీసుల మరమ్మతులు...
ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిన నేపథ్యం, కంకరగుంట ఫ్లై ఓవర్‌పై గుంటలు ఏర్పడిన క్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య చొరవ తీసుకున్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడటంతో పాటు, ట్రాఫిక్ నెమ్మదిస్తున్న క్రమంలో స్వయంగా ఆయనే, సిబ్బందితో కలిసి బ్రిడ్జిపై ఉన్న గుంటల్లో ఇసుక, కంకర పోసి వాటిని పూడ్చారు.
నగర పాలక సంస్థ అధికారులు బ్రిడ్జిపై గుంతలు పడుతున్నా.. పట్టించుకోకపోవటంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని వలన ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సీఐ సింగయ్య చొరవను అభినందించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి


నీటమునిగిన పొలాల వద్ద రైతులతో నాగేశ్వరరావు

తెనాలిటౌన్: భారీ వర్షానికి చెరువుల్లా మారిన మాగాణి భూములను జిల్లా వ్యవసాయ అధికారి ఐ.నాగేశ్వరరావు బుధవారం సందర్శించారు. గుంటూరు–తెనాలి వయా నందివెలుగు రోడ్డుమార్గంలోని రూరల్ మండల గ్రామాలైన హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. నీటి మునిగిన వరి చేలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటపొలాల్లో చేరిన వర్షపునీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపుకునేలా చూడాలని రైతులకు సూచించారు. రాబోయే రెండు రోజుల్లోనూ వర్షాలు పడే అవకాశం ఉందని గుర్తుచేశారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు రాకపోకలు బంద్


కండ్రిక మార్గంలో అండర్‌బ్రిడ్జి కింద నీరు


వేమవరం దారిలో నిలిచిన వర్షం నీరు

రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన నీరు

ఫిరంగిపురం: రెండురోజులగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మూడు ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నీరు నిలిచి పోవడంతో ఆయాగ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి సుదురుపాడు గ్రామం నుంచి కండ్రిక దారిలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి గుంటూరు – నరసరావుపేట రహదారి నుంచి వేమవరం దారిలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి. ఫిరంగిపురంలోని ఆరోగ్యనగర్, జగనన్న కాలనీల దారిలో ఉన్న బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు చేరింది. దీంతో ఆయాగ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

రైతు బాధలు పట్టని ఎమ్మెల్యే నరేంద్ర

నీట మునిగిన పొలాలను పరిశీలించిన అనంతరం విలేకరులతో వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ


నీట మునిగిన పంట పొలాల ఛాయాచిత్రాలను చూపుతున్న అంబటి మురళీకృష్ణ

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): భారీ వర్షాలకు పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లోని వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. నీట మునిగిన పంటలను బుధవారం పరిశీలించిన ఆయన గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాకాని – గోళ్లమూడి మధ్యనున్న గుంటూరు ఛానల్ నీట మునిగిందని, గతేడాదీ అదే పరిస్థితి నెలకొందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా గండి పూడ్చే పనులు చేపట్టడంతో కొద్ది రోజులుగా కురుస్తోన్న వర్షాలకు పొలాలు కొట్టుకుపోయినట్లు తెలిపారు. బుధవారం పంట పొలాలను పరిశీలిస్తే పొలాలు వలె లేవని, సముద్రం మాదిరి మారిపోయినట్లు చెప్పారు. గతేడాది నుంచి కూటమి ప్రభుత్వానికి ఈ కాల్వకు గండిపడుతుందని తెలిసి కూడా నల్లమట్టితో తూతూ మంత్రంగా పనులు ముగించారని ఆరోపించారు. ఇప్పటికే రెండు సార్లు విత్తు పెట్టగా, గతంలో, ప్రస్తుతం వర్షాల ధాటికి కొట్టుకుపోయానని అన్నారు. కాకానిలోని తాగునీటి చెరువును స్థానిక టీడీపీ నేతలు చేపలు కోసం తాగునీటిని బయటకు పంపించారని, ప్రస్తుత వర్షాలకు మురుగునీరు చేరిందని చెప్పారు. ఈ చెరువును శుద్ధి చేయాలంటే వచ్చే ఏడాది వేసవి వరకు ఆగాల్సిందేనని అన్నారు. స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతోనే నోటి వద్ద మంచినీటిని తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది ఎకరాలు నీట మునిగినా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఇవేమీ పట్టవని మండిపడ్డారు. పొన్నూరు నియోజకవర్గంలోని గ్రామాలన్నీ వర్షపు నీటితో నిండిపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారని అన్నారు. గతంలో పంట పొలాలు కోసం తీసుకున్న అప్పులు తీర్చకముందే మరోసారి కురిసిన భారీ వర్షాలకు అప్పులు చేయకతప్పని పరిస్థితి నెలకొందన్నారు. ఆఖరికి జిల్లా స్థాయిలో ఒక్క అధికారి కూడా నీట మునిగిన పంట పొలాలు వైపు కన్నెత్తి చూడలేదన్నారు. విత్తన ఖర్చు కింద రూ.10 వేలు, ఉచితంగా ఎరువులను పంపిణీ చేయాలని అన్నారు. పంట పొలాల్లో పర్యటించి, నీట మునిగిన పొలాల ఫొటోలను ఆయన మీడియా ఎదుట ప్రదర్శించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాడిబొయిన వేణుగోపాల్, విద్యార్థి విభాగం జిల్లా నాయకులు భాను పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం (బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,179
అమ్మకాలు	46,990
నిల్వ	7,010

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,400
నంబరు-5	10,000–13,300
341	10,000–14,200
సూపర్ -10	10,000–13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,500
నంబరు-5	10,000–13,400
341	11,000–14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,100
బాడిగ 5531	10,000 – 13,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,000
ఆర్మూర్	9,800 – 11,200
తాలుకాయలు	6,000 – 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000–14,200
బాడిగ – 5531	10,000–12,500
ఆర్మూరు	10,200 – 13000
తాలు	5,300 – 7,200

–కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు (బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 271

కొమ్ములు : 245 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,900	10,450	10,400

కాయలు : 26 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,000	10,000

మొత్తం అమ్మకాలు : 203.250 క్వింటాళ్లు